క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ ఆటోనగర్, విశాలాంధ్ర, మారుతీనగర్, విజయపురి ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 11కేవీ సమతాపురి, ఆర్.కె.పురం ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది.

నేటి నుంచి కంటివెలుగు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో 5వ డివిజన్ వినాయకహిల్స్ కాలనీ కమ్యూనిటీ హాలులో సోమవారం కంటివెలుగు కార్యక్రమం ప్రారంభం కానుందని కార్పొరేటర్ బోయపల్లి దీపిక తెలిపారు. నేటి నుంచి 17 వరకు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 వరకు శిబిరం కొనసాగుతుందని, నేత్ర పరీక్షల అనంతరం అవసరమైన వారికి కళ్లద్దాలు, ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

హుడాకాంప్లెక్స్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈ నెల 14న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. కన్సూమర్ గ్రీవెన్సెస్ సమావేశం హుడాకాంప్లెక్స్‌లోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నట్లు డీఈ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, టెక్నికల్ మెంబర్లు, ఫైనాన్స్, కన్స్యూమర్ ఎఫైర్స్ మెంబర్లు హాజరవుతారని, కావున దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలు, బిల్లుల్లో హెచ్చుతగ్గులపై ఫిర్యాదులు చేసి పరిష్కారం పొందాలని సూచించారు.

క్రీడాపోటీలతో స్నేహభావం



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న నరేష్ యాదవ్

పహాడీషరీఫ్: క్రీడలతో యువతలో ఐక్యత పెంపొందుతుందని బీజేపీ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పెరమోని నరేష్ యాదవ్ అన్నారు. మామిడిపల్లి గ్రామంలో జరిగిన ప్రీమియర్ లీగ్‌లో విజేతగా నిలిచిన కింగ్ రైడర్స్ జట్టుకు ట్రోఫీ, రూ.40 వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.20 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు గణేశ్‌గౌడ్, యాదగిరి, నరేష్‌గౌడ్, నయీం, మల్లేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడిగా ఆరీఫ్

తలకొండపల్లి: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ మండల అధ్యక్షుడిగా ఎండీ.ఆరీఫ్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి.. ఆరీఫ్‌కు వెల్జాల్‌లో ఆదివారం నియామకపత్రం అందజేశారు. మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన ఆరీఫ్ దశాబ్ద కాలంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించి మైనార్టీ అధ్యక్షుడిగా నియమించినట్లు వంశీచంద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ అజీం, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్, జనార్దన్‌రెడ్డి, చెన్నకేశవులు, శ్రీను, రమేష్, మన్నాన్‌గౌస్, విష్ణు, వెంకట్, డిగ్రీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వెండి నాగాభరణం బహూకరణ

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పంజుగుల జంగయ్యగౌడ్, ఆయన కుమారులు ప్రభాకర్‌గౌడ్, వెంకటేశ్వర్లుగౌడ్, శ్రీధర్‌గౌడ్ రూ.1.5 లక్షల విలువైన వెండి నాగాభరణాన్ని బహూకరించారు. ఆలయంలో ఆదివారం జరిగిన కల్యాణోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచి బట్టు అనురాధ, ఎంపీటీసీ కిషన్‌రెడ్డికి వెండి నాగాభరణాన్ని వారు అందజేశారు.

శివ దీక్షలు పవిత్రమైనవి

మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి: శివ దీక్షలు పవిత్రమైనవని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. దీక్షలతో క్రమశిక్షణ అలవాటుపడి ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడుస్తూ శివ దీక్షలు చేయాలన్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌లో ఆదివారం శివస్వాములు పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురుస్వామి పాండు వేద మంత్రాలు చదువుతూ, శివయ్య కీర్తనలు ఆలపిస్తుండగా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరుతున్న శివస్వాముల దారి ఖర్చుల కోసం శ్రీనివాస్ యాదవ్ ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో శివ, నరేందర్‌గౌడ్, శ్రీశైలం, సాయి, గుప్తా, గిరి పాల్గొన్నారు.

కనులపండువగా పెద్దమ్మ జాతర

భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం



ఆలయం వద్ద భక్తుల కోలాహలం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మాదన్నగూడలోని గరిగుట్ట పెద్దమ్మ ఆలయం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. అమ్మవారి 45వ కల్యాణ మహోత్సవాల్లో (జాతర) భాగంగా ఉదయం 6.30 గంటలకు పుట్ట బంగారం, మధ్యాహ్నం 1.30 గంటలకు అమ్మవారి తొట్టెల ఊరేగింపును ధర్మకర్త విఠల్‌బాబా పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుల, శివసత్తుల పూనకాల నడుమ మహిళలు సంప్రదాయ వస్త్రాధారణతో బోనాలు సమర్పించారు. సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి ఓడి బియ్యాలు పోశారు. ఆలయ ప్రాంగణంలోని సమ్మక్క సారక్కల దిమ్మెలకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. జల్‌పల్లి కౌన్సిలర్ యాదగిరి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్‌లు భక్తులకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఎస్సై మధుసూదన్‌లు బందోబస్తు పర్యవేక్షించారు.

పోటీ పరీక్షలతో మానసిక దృఢత్వం



టెస్ట్ పేపర్లు, ఓంఎంఆర్ షీట్లను ఆవిష్కరిస్తున్న బీరప్ప, తదితరులు

మీర్‌పేట: పోటీ పరీక్షలు విద్యార్థుల్లో మానసిక దృఢత్వం పెంపొందిస్తాయని లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సిద్దాల బీరప్ప అన్నారు. అభ్యాస్ అకాడమీ, లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఆదివారం బాలాపూర్ చౌరస్తాలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో 9వ రాష్ట్ర స్థాయి కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు సంబంధించిన టెస్ట్ పేపర్లు, ఓఎంఆర్ షీట్లను లార్డ్స్ స్కూల్స్ వైస్ చైర్మన్ నివాస్‌రెడ్డితో కలిసి చైర్మన్ బీరప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలాం సైంటిఫిక్ టెస్ట్‌ను రాష్ట్రంలోని 7 కేంద్రాల్లో 3నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఏకకాలంలో నిర్వహించామని తెలిపారు. అభ్యాస్ అకాడమీ సీఈఓ డా.ఫణిపవన్ మాట్లాడుతూ.. ఈ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏప్రిల్ 16వ తేదీన రవీంద్రభారతిలో ప్రముఖులచే పురస్కారాలను అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాగ్దేవి జూనియర్ కళాశాల డైరెక్టర్ రవికుమార్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ జ్యోతికి నేషనల్ అవార్డు



ఎంపిక పత్రాన్ని అందుకుంటున్న ఎంపీపీ

కందుకూరు: కందుకూరు ఎంపీపీ మంద జ్యోతి పాండు ఉమెన్ లీడర్ షిప్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్ఏ)జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఆదివారం హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో ఆమెను సన్మానించి ఎంపిక పత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం బహుజన సాహిత్య అకాడమీ ఏటా ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రజాసేవ చేస్తున్న వారికి అవార్డులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది మార్చి 12న తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా ఉమెన్ లీడర్ షిప్ నేషనల్ అవార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం గౌతమ్, కోఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుని కల్యాణోత్సవం



పూజలో పాల్గొన్న సర్పంచి అనురాధ

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలో నూతనంగా పునర్నిర్మించిన శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం భవానీ, రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నూతనంగా పునర్నిర్మించిన శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో నాలుగు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రామలింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో నిర్మించిన కల్యాణ మండపాన్ని పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయం పూజారులు మురుకుంట్ల వెంకటసుబ్బయ్య, శ్రీనివాస శర్మ నేతృత్వంలో సర్పంచ్ బట్టు అనురాధ, ఎంపీటీసీ సభ్యులు బట్టు కిషన్‌రెడ్డిల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి కొల్కులపల్లి గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఉపసర్పంచ్ ధనయ్యగౌడ్, టీఆర్ఎస్ నాయకులు బట్టు ధర్మారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

విజిలెన్స్ సీఐ చరమందరాజుకు సత్కారం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయాన్ని ఆదివారం నల్గొండ జిల్లా విజిలెన్స్ సీఐ గజ్జి చరమందరాజు సందర్శించారు. ఈ సందర్భంగా గజ్జి చరమందరాజుకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజలో ఆయన పాల్గొన్నారు. విజిలెన్స్ సీఐ గజ్జి చరమందరాజును దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ చుక్కా అల్లాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి గంగా రవి, సభ్యులు.. యాదయ్య, పల్లెనారాయణ, చిన్నబాలకృష్ణ, మల్లేశ్, బాలకృష్ణ, వెంకటయ్య, నాగయ్య, యాదయ్య, కుమార్ పాల్గొన్నారు.

బిక్యానాయక్ కుటుంబానికి పరామర్శ

ఆమనగల్లు: మాడ్గుల మండలం చంద్రాయణపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందిన నుచ్చుగుట్టతండాకు చెందిన శాంతి కుటుంబ సభ్యులను ఆదివారం ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట చల్లా సతీమణి అశ్లేషారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, ఆమనగల్లు మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ నాయక్, దళపతి, బుచ్చిరెడ్డి, చందు, భాస్కర్, రాగ్య, ధర్మా, యాదగిరి, ఆంజనేయులు ఉన్నారు.

ధరణి లోపాలను సరిచేయండి

రైతుసంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

యాచారం: టీఆర్ఎస్ సర్కార్ తెచ్చిన ధరణి పోర్టల్‌లో లోపాలను సరి చేయకపోతే తీవ్ర ఆందోళన తప్పదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ... ధరణి పోర్టల్‌తో సర్కార్‌కు ఆదాయం రావడమే కాని.. రైతాంగానికి పెద్ద శాపంగా మారిందని అన్నారు. ధరణి లోపాలతో ఏ గ్రామంలో చూసినా 200 నుంచి 300కు పైగా భూ సమస్యలు ఉన్నాయని అన్నారు. మీ-సేవలో రూ.వేలాది ఫీజులు చెల్లించినా కూడా సరైన న్యాయం జరగడం లేదని అన్నారు. ధరణి పోర్టల్ అనంతరం రైతులకు సమస్యలు నివృత్తి చేసే విషయంలో కూడా అధికారులు తప్పించుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే ధరణి పోర్టల్‌లో ఉన్న లోపాలను సరిచేయకపోతే వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు తగిన గుణపాఠం తప్పదని అన్నారు.

శ్రీ సాయినగర్ కాలనీ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని 12వ వార్డు హత్తిగూడలోని శ్రీ సాయినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీలో జరిగిన అసోసియేషన్ సర్వ సభ్యసమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. అధ్యక్షుడిగా పి.బాబూనాయక్, ఉపాధ్యక్షులుగా రమేష్ కంచుకట్ల, రాంరెడ్డి, సంజీవ, శివ, ప్రధాన కార్యదర్శి సోము, కోశాధికారిలుగా శ్రీను, వికాస్, సంయుక్త కార్యదర్శులుగా వేణు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా అమర్‌నాథ్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా అన్నెబోయిన విజయ్‌కుమార్, నర్సిరెడ్డి, లీగల్ అడ్వయిజర్‌గా ప్రభాకర్ ఎన్నికకాగా ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కృష్ణారెడ్డి, శంకర్‌నాయక్, వీరన్న, చిన్నపోమన్న, పుల్లయ్య, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

కేంద్రం నిధులతోనే పల్లెల్లో అభివృద్ధి

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్



ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

యాచారం: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగికార్ రమేష్ అన్నారు. నందివనపర్తి గ్రామంలో ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణం వద్ద ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి ఆదివారం ఆయన క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధుల ద్వారానే గ్రామాల్లో సీసీరోడ్లు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, మొక్కల పెంపకం వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. కేసీఆర్ సర్కార్ గ్రామాల్లో పైసా ప్రత్యేక నిధులు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. గ్రామ పంచాయతీల్లో నిధుల్లేక సర్పంచులు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నారని.. సకాలంలో బిల్లులు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయకుమార్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రామనాథం, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు సురేష్, శ్రీకాంత్, రమేష్, శ్రీరాములు, మధుకర్, శ్రీనివాస్, మహేశ్, శివాజీ, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో భక్తులు

మహేశ్వరం: అమీర్‌పేట్ పురాతన రామేశ్వర శివాలయంలో గణపతి, నంది, పార్వతీ, నాగదేవత, శిఖర విగ్రహాల ప్రతిష్ఠ, పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం ప్రాతకాల పూజలు, శుభస్వాతి నక్షత్రంలో గణపతి, నంది, పార్వతీ, నాగ, ధ్వజ, శిఖర ప్రాణప్రతిష్ఠ, విగ్రహప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, అలంకరణ, నేత్రానిలయం, గోదర్శనం, దివ్యదర్శనం, హారతి, మంత్రపుష్పం, వేద ఆశీర్వచనం ఉదయం 10.05 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించగా.. సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. మహాపడి పూజ, జ్యోతిర్ముడి కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నదానం చేశారు. వేడుకలకు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అమీర్‌పేట్ ఎంపీటీసీ కుమారి రాయప్ప, ఉప సర్పంచ్ నర్సింగ్, వేంకటేశ్వర ఆలయ చైర్మన్ ఆవుల రమేష్, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు గొల్లూరు రాజు, నాయకులు ప్రవీణ్, చంద్రమోహన్, శ్రీకాంత్, శివాలయ కమిటీ అధ్యక్షుడు బస్వ రవీందర్ గౌడ్, గురుస్వాములు ప్రభాకర్, శేఖర్, ప్రసాద్, నరేష్, గ్రామ పెద్దలు, ఆలయ పూజారి ప్రేమ్ శర్మ పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సైలు, ప్రజాప్రతినిధులు

కందుకూరు: గెలుపోటములు సమానంగా స్వీకరించాలని ఎస్సైలు శ్రావణ్‌కుమార్, నాగరాజు అన్నారు. మండల పరిధిలోని బాచుపల్లిలో ఎంపీటీసీ గుండాల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీపీఎల్ క్రికెట్ పోటీల్లో విజేతలకు ఆదివారం వారు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో క్రీడాపోటీల నిర్వహణ ద్వారా నైపుణ్యమున్న క్రీడాకారులను గుర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. క్రీడలతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కాగా, గ్రామానికి చెందిన ఎగిరిశెట్టి నరేష్ ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.7 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.3 వేలు అందజేయగా, ఎగిరిశెట్టి రాజు రూ.15 వేల విలువైన జ్ఞాపికలను అందించారు. చల్లపల్లి కృష్ణ, దువ్వాసి నరసింహ, యాలాల రాఘ వేందర్ క్రీడల సమయంలో అన్నదానం కింద రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యాలాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

సినీ స్టంట్ మాస్టర్లు రామ్, లక్ష్మణ్



కార్యక్రమంలో పాల్గొన్న స్టంట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని సినీ స్టంట్ మాస్టర్లు రామ్, లక్ష్మణ్‌లు అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన పిరమిడ్ మెడిటేషన్ శాటిలైట్ హిందీ చానల్‌ను వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... శతాబ్దాలుగా భారతదేశంలోని ప్రజల దైనందిన జీవితంలో మెడిటేషన్ ఓ భాగంగా ఉందన్నారు. ఆధ్యాత్మికతతో ఒత్తిడి తగ్గుతుందని తద్వారా జీవన విధానంలో ఎన్నో మంచి మార్పులు చేకూరుతాయన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి పిరమిడ్ మెడిటేషన్ చానల్ ఆవిర్భవించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ... అన్ని రాష్ట్రాల్లో ఈ చానల్ ప్రగతి పథంలో దూసుకు వెళ్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో చానల్‌ను ప్రారంభించామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దట్ల హనుమంత రాజు, మారం శివప్రసాద్, రాందాస్, దీప్తి, బాలకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు అండగా ఉంటా..

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాకు 25 వేల మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారని అన్నారు. వారిలో రాత్రి వరకు 1264 మందికి ప్రత్యక్షంగా, 6వేల మందికి వాట్సాప్ ద్వారా నియామకపు పత్రాలు పంపించడం జరిగిందన్నారు. మరో పది రోజుల్లోగా మరో 6000 మందికి ఉద్యోగాలు రానున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన 70 శాతం మందికి, ఇతర ప్రాంతాలకు చెందిన 30 శాతం మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. ఉద్యోగం రాలేదని ఎవరూ బెంగపడవద్దని, రాబోయే రోజుల్లో మిగతా వారికి కూడా ఉద్యోగం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పదవ తరగతి వారికి కూడా రూ. 10 వేల వేతనంతో కూడిన ఉద్యోగాలు వచ్చాయని, వారికి ఈఎస్ఐ, పీఎఫ్, టీఏ అలవెన్సులు కల్పిస్తామని కంపెనీలు తెలిపాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరొక జాబ్ మేళాను ఏర్పాటుచేసి నిరుద్యోగ యువతకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమానికి సహాయ, సహకారాలు అందించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు, పలు విభాగాల చైర్మన్లు, సీనియర్ నాయకులు, డివిజన్ల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, ఉద్యమకారులు, కార్యకర్తలు, మహిళలు, వలంటీర్లు, వివిధ కంపెనీల మేనేజర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

బీఆర్ఎస్ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



ఆగాపల్లిలో ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మంచాల: నియోజకవర్గంలో ఎనిమిదేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి ప్రారంభించిన ప్రగతి నివేదన పాదయాత్ర ఆదివారం మంచాల మండలంలో పూర్తయ్యింది. చివరిరోజు ఆగాపల్లి, నోముల గ్రామాల్లో యాత్ర కొనసాగింది. ఇప్పటికి 22 రోజులుగా రెండు మండలాలో 42 గ్రామాల్లో తిరిగి 300 కిలోమీటర్లు పూర్తి అయ్యింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ప్రధానంగా మహిళలు, రైతులు ముందుకు వచ్చి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి గొప్పగా మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు. ఎంతో వెనుకబాటుకు గురైన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎనిమిదేళ్ల కాలంలో ఎంతో పురోగతి సాధించిందన్నారు. భవిష్యత్‌లో అభివృద్ధికి మారు పేరుగా నిలుస్తుందని తెలిపారు. ఇంటింటికి తాగునీరు అందించిన కేసీఆర్‌ను ప్రజలు కొనియాడుతున్నారని పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా అందించి వ్యవసాయానికి పెద్ద పీట వేశారని అన్నారు. ఆసరా పథకం కింద అర్హులందరికీ పింఛన్లు అందించి వృద్ధులకు పెద్ద కొడుకుగా కేసీఆర్ మారాడని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందుతున్నాయా లేదా అనే విషయాలు తెలుసుకొని అర్హులందరికీ అందించాలని స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఊరురా పంపించడం జరిగిందన్నారు. గ్రామాల్లో ప్రజలు తెలిపిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి బహదూర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు జంగయ్య, బాలరాజ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రాజు, మండల యువజన విభాగం అధ్యక్షుడు బద్రీనాథ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు వీరేష్, ప్రభాకర్, జంగయ్య తదిదతరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలోకి ప్రగతి నివేదన యాత్ర

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తనయుడు, బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన యాత్ర సోమవారం ఇబ్రహీంపట్నం మండలలోకి అడుగుపెడుతోంది. స్థానిక మున్సిపాలిటీలోని సీతారాంపేట గ్రామంలోకి ఈ పాదయాత్ర ఎంట్రీ అవుతుంది. అనంతరం మండలంలోని రాయపోల్, ముకునూర్, దండుమైలారం మీదుగా యాత్ర కొనసాగనుంది. యాచారం మండలం నందివనపర్తి గ్రామం నుంచి గతనెల 22న ఈ పాదయాత్రను ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. యాచారం, మంచాల మండలాల్లోని పలు గ్రామాలల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ తన పాదయాత్రను ప్రశాంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు రెండు మండలాల్లో 42 గ్రామాలు 300 కిలోమీటర్ల పాదయాత్రను ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పూర్తిచేసుకున్నారు.